# శ్రావణ మంగళవారం

శ్రీ అయ్యగారి విశ్వేశ్వర రావు

(గతసంచిక తరువాయి)

ఆఫీసులో అడుగుపెట్టాక అనుకున్నాను. క్రిందటి మంగళవారం చాలా అవస్థపడ్డాను-తలనొప్పితో-రిక్షావాడి పోరుతో-శ్రీమతి యింట్లో లేకపోవడంతో. యివాళైనా చెప్పలేదు చూడండి ఆవిడ, మళ్లీ నన్ను బాధపెట్టడం ఆవిడకు ఆనందమంటారా? ముందరగా - యివాళ మంగళవారం - చాలా పేరంటాలు వున్నాయి. తొందరగా యింటికి రావడం పడదు. మీరు ఆఫీసునుంచి మెల్లిగా మొదటిఆట సినీమాకిపోయి - హాయిగా పదింటికి రండి అనైనా చెప్పచ్చు, లేదా రెండు తాళంచెవులున్న గాడ్రేజ్ తాళంకప్ప సింహద్వారానికి బిగించి ఒకతాళంచెవి తనదగ్గఱ వుంచుకొని — రెండోది నాకివ్వచ్చు. ఏ బాధా ఎవరికీ వుండదు. అలా ఏదీ చేయకుండా — ఏమీ చెప్పకుండా — ఎలాగోలాగ నన్ను యిరుకులో వుంచాలని యింటావిడ తీర్మానించిందా? తికమకగా వుంది. దేవుడి దయవల్ల యివాళ తలనొప్పి రాకూడదు. మనీపర్సు ఆఫీసు డ్రాయరులో మరిచిపోకూడదు. డబ్బులు లేకుండా రిక్షా ఎక్కకూడదు — అని గత మంగళవారంనాడు నన్ను డీలాచేసి డింకీలు కొట్టించిన లోపాలన్నీ సవరించుకోవాలని తీర్మానించుకున్నాను. అటెండెన్సు రిజిస్టరులో సంతకం పెట్టాను. సీటులో కూర్చుని చలాకీగా పనిచేసుకుంటున్నాను. ఇంతలోనే డఫేదారు జగ్గయ్య అయ్యగారు రమ్మంటున్నారని చెప్పాడు. ఎందుకు పిలిచారో — ఏవిటో! అనుకుంటూనే కొంచం జంకుతో పోతున్నాను ఆఫీసరుగారి గదిలోకి. కాని చాలా శుభశకునాల సంబడితో ఆఫీసుకు విచ్చేసిన మనకు అన్నివిధాలా అన్ని రంగాలలోనూ ఆఫీసులో జయం - విజయం సిద్ధించక తప్పదనే ధీమా మాత్రం జంకలేదు. ఆఫీసరుగారు నన్నుచూసి పకపక నవ్వి - రండి రావుగారూ - రండి . అని మళ్లీ పకపక నవ్వారు.

ఒకరు నవ్వుతూంటే ఎదుటివాళ్లకీకూడ నవ్వు వస్తుంది. మరొకరు నవ్వుతూంటే భయంవేస్తుంది. ఇంకొకరు నవ్వుతూంటే కోపం వస్తుంది. ఇంకొరకం నవ్వు మనకు సిగ్గు తెప్పిస్తుంది. ఇలాంటి నవ్వులేన్నికదూ - నాలుగువిధాల నష్టం అన్నారు మన పెద్దలు

మా ఆఫీసరు - నన్ను రమ్మని పిలిచి యిలా పకపక నవ్వుతూ - రండి! రండి! అని మర్యాదచేసినా నాకది అంతా అయోమయంగా వుంది. నిష్కారణంగా నన్నుచూసి నవ్వుతాడా? అంతటి పెద్దమనిషి! లేకపోతే నన్నుచూసి నవ్వవలసినంత అత్యవసరం ఆయనకేమివుంది? తెలియక తికమకలో పడ్డాను.

అయితే రావుగారూ! యివాళ యేవారం అండీ? అని అడిగాడు ఆయన. వారాల వివరం తెలియకుండా వుంటాడా? యీయన. తెలిసేవుంటుంది. తెలిసిన విషయాన్ని నన్నెందుకు అడుగుతున్నాడు? ఆఫీసులో అందర్నీ వదిలి నన్నెందుకు అడుగుతున్నాడు? ఈయనకి శ్రావణమంగళవారం సరదా వుందా? లేకపోతే వాళ్ల ఆవిడకూడా మా ఆవిడలాగే శ్రావణమంగళవారం సర్క్యూటు కొట్టుతోందా. ఏమో! అయినా చెబుదాం. అడిగినది పెద్దమనిషి, ఆఫీసరు, తెలిసి అడగవచ్చు—తెలియక అడగవచ్చు. నిజం నిండుగా చెప్పదాం అని తీర్మానించుకొని — ఇవాళ మంగళవారం సార్, శ్రావణ మంగళవారం. చాలా మంచిరోజు. పూర్వం శ్రావణ మంగళవారం గవర్నమెంటువారిచే డిక్లేరు కాబడిన పబ్లిక్ హాలిడే. కాని హాలిడేస్ లేవనింగులో గుటకాయస్వాహా చేయబడిన యన్. జి. వోల దుర్దినం. కాని అతివల ఆనందదినం, పేరంటాండ్ర పర్వదినం... అంటూ ఆయన నా వాగ్ధోరణిని మెచ్చుకొని మంచి అయిడియా మనస్సులో వుంచుకుంటాడని చెప్పాను.

ఇదంతా చల్లగా విని ఆ అసాధ్యుడు హెడ్ గుమాస్తాని పిలవమన్నాడు, చెప్పద్దూ, నాకు భయమేసింది. ముచ్చెమటలు పడుతున్నాయి. ఒకందుకు మాట్లాడితే యింకోటి సంఘటించినంత చాలు వచ్చినట్లుంది. ఆవేశంలో శ్రావణ మంగళవారం గొప్ప చెప్పాను. అదే చిక్కయిందా? అవును శ్రావణ మంగళవారం ఎప్పుడు వస్తుందా అని ఎదురుచూచే

ఘోటకబ్రహ్మచారులున్నారు. అవేళ అమాయకులైన ఆడపిల్లల వెంటపడే కామదాసులూ వుంటారు. దవడ వాచేటట్టు లెంపకాయలు తినే రౌడీలు వుంటారు. ఆ మహిళల సౌందర్యాన్ని చూసి వుప్పొంగే వుత్సాహవంతులూ వుంటారు. "ఎ థింగ్ ఆఫ్ బ్యూటీ యీజ్ జాయ్ ఫరెవర్" అనే కీట్సు శిష్యులూ వుంటారు, నన్ను అలాంటి వర్గంలో జమ కట్టడానికా యీయన హెడ్‌గుమాస్తాను పిలిచింది! అదేం న్యాయం చెప్పండి. నలుగురి పిల్లల తండ్రిని - సగం నెరిసినజుట్టు కలవాడిని _ నలభైఏళ్లు నిండినవాడిని నాకి కీచకవ్యామోహం వుంటుందని వూహించడం ఎంత న్యాయమో వూహించండి.

హడావిడిగా హెడ్ గుమాస్తా కోటు సర్దుకుంటూ _ కళ్లద్దాలు తగిలించుకుంటూ ఆఫీసరుగారి దగ్గఱకు వచ్చాడు. నన్నూ _ నా పోజూ నిదానిస్తూ, ఈ హంగామా అంతా చూస్తున్నాను - మతిలేదు: అసాధ్యుడు _ ఆఫీసరు అటెండెన్సు రిజిస్టరు ఎత్తి చూపెట్టాడు ఆ హెడ్‌గుమాస్తాకి. చూపెడుతూ అన్నాడు— చూశారా! యుద్ధం రోజుల్లో గడియారాలు గంటముందు చూపించేవి. ఈ శ్రావణ మాసంలో మన రావుగారి మనస్సు ఒకరోజు ముందు పోతూంది - అని మళ్లీ ప్రారంభించాడు మాసేసిన మాయనవ్వుని.

ఔను సార్. మన రావుగారు మంగళవారం సంతకం కూడా సోమవారంనాడే పెట్టేశారు అన్నాడు హెడ్‌గుమాస్తా - అటెండెన్సు రిజిస్టరు చూసి!

అది కాదండీ! వీరికి అన్నివారాలు శ్రావణ మంగళవారాలైతే బాగుండును. ఇప్పుడే శ్రావణ మంగళవారం మీద ఎంతో మాట్లాడారు అని మళ్లీ అన్నాడు ఆ అసాధ్యుడు.

అతడు అలాంటి దురూహలు గలవాడు కాదండి. సీనియరు అప్పరు డివిజను గుమాస్తా, పిల్లలున్నవాడు. మర్యాదగల వంశీకుడు. మర్యాగదల వంశీకుడు. అతడికి శ్రావణ మంగళవారం పిచ్చగాని - వేటగాని లేవండి! అన్నాడు హెడ్‌గుమాస్తా. ఆయన కాండక్టు సర్టిఫికెట్టు కళ్లనద్దుకున్నాను. పరువు నిలబడింది.

ఊరికే అన్నాను సీరియస్‌గా తీసుకోకండి రావుగారూ! అన్నారు ఆఫీసరుగారు. అబ్బే! అతను చాల స్పోర్టివ్‌గా వుంటాడండి అని చెప్పి _ హెడ్ గుమాస్తా - నన్ను భుజంమీద చరిచి లాక్కొచ్చాడు అఫీసుహాలులోకి. తోటి గుమాస్తాలంతా ఏవిటేవిటి? అని అడుగుతూంటే - మా మంచివాడు ఆ హెడ్ గుమాస్తా అన్నాడు - ఏముంది? ఇదంతా - టీ కప్పులో తుపాను!

అదోమాదిరిగా _ నిండిన నిరుత్సాహంతో యింటికి వచ్చేసరికి _ మా శ్రీమతి అలా వున్నారేం? అంది. కాళ్లూ - వేళ్లూ _ ముఖం కడుక్కుని _ తుడుచుకొని _ యీజీచెయిర్లో మేను వాల్చి - యిల్లాలు యిచ్చిన ఆ వేడికాఫీ తాగుతూ - ఆఫీసులో జరిగిన ట్రాజిడీ చెప్పాను ఆవిడకు.

ఇదంతా విని - మా శ్రీమతికూడా మా ఆఫీసరులాగే పకపక నవ్వింది. నా మనస్సు అన్నిడిగ్రీల వేడిలో కుతకుత కాగిపోతూంటే నా సహధర్మచారిణి సందుచూసుకొని యింతగా నవ్వడం నాకేమీ బాగాలేదు. ఎంతైనా కోపం వచ్చింది - మా ఆవిడ మీద. కాని కోపించలేదు - శాంతిప్రియుణ్ణి కాబట్టి!

ఆవిడ అంది అప్పుడు, ఎంత అమాయకులండీ! అని.

ఇది మరీ బాగుంది. ఎలా చెప్పగలదు ఆవిడ నేను అమాయకుడినని? రీజను లేకుండా కంక్లూజను వుంటే చెడ్డచిక్కు సుమాండి.

మళ్లీ అందుకుంది మా శ్రీమతి, ఎప్పుడు పేరంటాళ్లు కనిపిస్తే అప్పుడే శ్రావణ మంగళవారం అనుకున్నారు కదూ! అంది నవ్వుతూ.

ఔను. - అదే పాయింటు. ఆ ఎదురయిన పేరంటాండ్ర మూలంగానే క్యాలండర్ రోజులలో గలాట వచ్చింది నా మనస్సులో అన్నాను.

ఇంత వెఱ్ఱివారు ఎలా బ్రతుకుతారండీ! అంటూ జాలిగా అని మళ్లీ అందుకుంది. మంగళవారంనాడు పేరంటానికి రమ్మనమని సోమవారంనాడు పిలుచుకోరటండీ అంది. ఇంతమాత్రం తెలియలేకపోయారా? అనే చూపులతో.

ఒహో? అదా సమాచారం అనుకుని అటెండెన్సులో పడిన రెండు సంతకాల మాటా తలుచుకోనేసరికి ఆఫీసరుగారి పకపక నవ్వులు చెవ్వుల్లో మారుమ్రోగాయి. 'ప్రమాదోధీమతామపి' అనే సూక్తి జ్ఞప్తికి వచ్చి శాంతినిచ్చింది.

♦ ♦ ♦

వంట అయిందా లేదా! చప్పనకానీ వడ్డన! యివాళ జరూరుగా పోవాలి అఫీసుకి అన్నాను మా

ఆవిడతో. పెషావరు మెయిలు స్పీడు తగ్గించండి - కాస్త అంది ఆమె నవ్వుతూ. ఏం - ఆఫీసుకి యింకా టయిం కాలేదనుకుంటున్నావా? చప్పున వడ్డించు - యివాళ పెందలాళే పోవాలి - ఎన్నో అర్జంటు కాయితాలు వున్నాయి - అన్నాను.

మీరు మంచివారు కాని - యివాళటికి కాస్త శలవు పెట్టండి - నా మాటవిని అంది ముసిముసి నవ్వులు పూరించే ముఖంతో. సరే - బావుంది. శలవు పెట్టడం అంత తేలిక అనుకున్నావా, యివాళ అలా శలవు పెట్టడానికి వీల్లేదు - అన్నాను.

అవునులెండి. శలవుకోసం మీకు అవసరమైన రోగాలు వస్తాయి ఎన్నైనా. ఏ రోగం లేకపోయినా - శలవుచీటీలో జ్వరాలు - తలనొప్పులు - విరోచనాలు - దగ్గు - ఖంకవిరోచనాలు బ్రహ్మాండంగా కనిపిస్తాయి. అబద్ధాలాడినా సరే - పాపం లేదని - పాతికన్నర తప్పుడు కారణాలతో శలవు సంపాయించుకుంటారు యిష్టమయితే. నేను అడిగాను కదా! అనేగా శలవురాదు - శలవులేదు - శలవు యివ్వరు - అంటున్నారు - అంది మూతి బిడాయించి - చిరుకోపం చిందిస్తూ మా శ్రీమతి.

ఇంతకీ - ఎందుకు నేను శలవు పెట్టడం - ఆ మాట ముందర చెప్పు తరవాత నేను - ఆపని సాధ్యమో! అసాధ్యమో! ఆలోచిస్తానన్నాను.

ఆమాట అనగానే - ఆవిడ ఆనందంతో మొహం యింతచేసుకొని - మావారు దారికే వస్తున్నారనే మురిపెంతో యిలా అంటుంది.

"ఏమీలేదండి. ఇవాళ ఆఖరు మంగళవారం కదూ, చాలా పేరంటాలు వున్నాయి. వీరభద్రపురం- దానవాయిపేట - యిన్నీసుపేట - వరకూ పోవాలి. ఈ పిల్లలతో అన్నియిళ్లూ తిరగడం యిబ్బందిగా వుంటుంది. వీళ్లందరినీ యింట్లో పెట్టుకుని హాయిగా మీరు ఆనందిస్తూవుంటే శ్రావణయాత్ర చక్కగా సాగించుకొని చప్పున వస్తాను." అని ముగించింది.

ఇదా నీ హితోపన్యాసం. చాలా బావుంది. మీసంవున్న మగాణ్ణి ఆడంగిఅబ్బన్న కింద యింట్లో అలా అఘోరించమంటావు. ఇదేనా నీవు చెప్పేది. ఇందుకనా - నన్ను శలవుపెట్టమన్నది. మంచిదానవు కాని - ఆ వచ్చే శనగలు ఎన్నో అంచనా వేసి చెప్పు. ఇప్పుడే కిరాణా కొట్లో కొని నీముందు పడేస్తా. పేరంటాళ్ల బెడద నీకూ తప్పుతుంది, శలవుచీటీ [illegible] నాకూ తగ్గుతుంది - అన్నాను మంచివేడిగా.

ఇంతధాటీగా నేను అంటున్నా - వేడివేడి కోపాన్ని - ఐస్‌కూల్‌గా చేసిపారేసే చల్లని ఘాటు నవ్వు నవ్వుతూ - ఆడాళ్ల మాటలు విన్నంత మాత్రంతో ఆడంగి అబ్బన్నలు అవరండీ! ఆడాళ్లని సుఖపెట్టేవాళ్లు ఎలాంటివాళ్లు? సంఘానికి దివ్యజ్యోతులు! అరమరికలేని మనసులతో—ఆలుమగలున్నప్పుడే యింట్లో ఆనందం - ఆయిల్లే స్వర్గం! అని మీరు అందరికీ చెప్తారు, కథలు వ్రాస్తారు పత్రికలలో, కర్టెను లెక్చర్లిస్తారు. అనుభవానికివస్తే యిలా ఫిరాయిస్తారు ధర్మమేనా చెప్పండి - అంది.

అలా అన్నావా? నా బాధకూడా గమనించాలి. ఇటీవలే కదా! శ్రావణ మంగళవారం అనే అపోహ ఎంతదుమారాన్ని లేవగొట్టిందో ఆఫీసులో - విన్నావుగా. నాకేదో శ్రావణ మంగళవారం అంటే ప్రత్యేక మమకారం వుందేమోనని అనుమానం ఆఫీసులో వుంది. సరిగ్గా అదే మంగళవారంనాడు నేను శలవు పెడితే - ఆఫీసువాళ్ల అనుమానానికి బలం కాదూ! అయినా - శలవు పెట్టినప్పుడు కారణం చెప్పాలి. ఆ కారణం వాళ్లకి నచ్చేటట్టుండాలి. మా ఆవిడ పేరంటానికి వెళ్లుతూంది కాబట్టి, పిల్లల్నందర్నీ యింట్లో దిగబెట్టింది కాబట్టి, ఆవిడ వచ్చేదాకా ఆ పిల్లల్ని సంరక్షించే భారం నామీద వేసింది కాబట్టి యీరోజున ఆఫీసుకు హాజరు కాలేనని వ్రాసినా - ఆ శలవుచీటీ ఎంత నవ్వుల పాలవుతుందో కాస్త ఆలోచించు అన్నాను.

(సశేషము)

కడుపునొప్పి, నోట నీరూరుట,
త్రేపులు, వాంతులు, మలబద్ధకము
లాంటి అజీర్ణ లక్షణములకు
కేసరిగారి
ఆదిత్య లవణము
దివ్య ఔషధము
వెల రు. 1-75 న.పై.
కేసరి కుటీరం ప్రైవేటు లిమిటెడ్
మద్రాసు 14.